## క్లుప్తంగా

### అంబులెన్స్‌లో ప్రసవం



గోవిందరావుపేట: మండల పరిధిలోని రాంనగర్ పందిరి దోనకు చెందిన మహిళ అంబులెన్స్‌లో ప్రసవించింది. వివరాలిలా ఉన్నాయి.. రాంనగర్ పందిరి దోనకు చెందిన ఎట్టి నందిని పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబీకులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. గోవిందరావుపేటకు చెందిన 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ యుగందర్ ప్రసవం చేసి ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించారు. 108 పైలట్ సైదులు త్వరగా ఆస్పత్రికి తరలించడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

### కేసు నమోదు

కన్నాయిగూడెం: పేకాట స్థావరంపై దాడి చేసి పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ఏటూరు ఇసుక క్వారీ వద్ద కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో సోమవారం రాత్రి దాడి చేసినట్లు తెలిపారు. ఈఘటనలో 13మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక లారీలపై పరదాలు కప్పుతు వచ్చిన సొమ్ముతో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు.

### ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ బడులు



మహాముత్తారం: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనందిస్తున్నామని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బోర్లగూడెం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ కమిటీ, మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులకు బడిబాట కార్యక్రమంపై వివరించారు. బడీడు పిల్లలను పనులకు పంపకుండా పాఠశాలకు పంపించే విదంగా గ్రామాల్లో అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సువర్ణ, మహిళా సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు రాంసింగ్, నవీనా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### గడువు పొడిగింపు

కాటారం: కాటారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 14 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోపా, డ్రాఫ్ట్స్‌మన్ సివిల్, ఎలక్ట్రిషియన్ ఫిట్టర్ ట్రేడుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐటీఐ ద్వారా ఉత్తమ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

### 13న సామాజిక తనిఖీ ప్రజావేదిక

కాటారం: కాటారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 13న ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాబు తెలిపారు. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2014 వరకు మండలంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా జరిగిన అభివృద్ధి పనులపై తనిఖీ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తనిఖీ బృందాలు గుర్తించి అంశాలపై తయారు చేసిన నివేదికలను ప్రజావేదికలో వెల్లడించనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ప్రజావేదికను విజయవంతం చేయాలని కోరారు.

### కరెంట్ షాక్‌తో ఎద్దు మృతి



మల్హర్: మండలంలోని పెద్దతూండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్‌రావుపల్లిలో విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. బాధితుడు బియ్యని రాములుకు చెందిన ఎద్దు కిషన్‌రావుపల్లిలోని పంట పొలాల సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంగళవారం మేత మేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రాములు కోరారు.

# ప్రభుత్వ బడుల్లోనే అన్ని సౌకర్యాలు

● బడిబాట గ్రామసభ



మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారి దివాకర్

గోవిందరావుపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని సౌకర్యాలు ఉన్నాయని, బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, పిల్లలకు నాణ్యమైన విద్యని అందించాలని రాష్ట్ర ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో బడిబాట గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ సాజీదా బేగం అధ్యక్షత వహించగా, గ్రామసభ ఎజెండాను గ్రామ కార్యదర్శి దేగల శంకర్ చదివి వినిపించారు. 6రోజుల పాటు నిర్వహించిన బడిబాట కార్యక్రమం ప్రగతిపై చర్చించిన అనంతరం గ్రామసభ ఎజెండా ఆధారంగా చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి గొంది దివాకర్ హాజరై మాట్లాడారు. సెక్టోరియల్ ఆఫీసర్‌లు రాజు, సాంబయ్య మాట్లాడుతూ.. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 125పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. డిజిటల్ విద్యా బోధన నూతన బెంచీలు పాత వస్తువులు అన్ని నేడు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయన్నారు. రఘురాం మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లలందరినీ గుర్తించామని తెలిపారు. వారందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విధంగా ప్రేరణ కలిగించామని అన్నారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు. స్పెషల్ ఆఫీసర్ సాజీదా బేగం మాట్లాడుతూ.. బాల్యంలో అందరం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఈ స్థాయికి వచ్చామని గుర్తు చేశారు. అప్పటికి, ఇప్పటికి ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో వత్యాసం ఉందని, గ్రామంలోని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకు సభలు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ములుగు రూరల్: పెసా చట్టం నిబంధనల మేరకు ఏజెన్సీ గ్రామాల్లో సభలు నిర్వహించాలని ఐటీడీఏ పెసా కో ఆర్డినేటర్ కొముురం ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టికల్ 244 ప్రకారం ఏర్పడిన పెసా గ్రామసభల ద్వారానే 5వ షెడ్యూల్డ్ భూభాగం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మండలంలోని గిరిజన గ్రామాల్లో గిరిజన మత్స్య సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో గిరిజన పెద్దలు, డ్వాక్రా మహిళా సంఘాల ప్రతినిధులు, యువతీ, యువకులు సమన్వయం చేసుకుంటూ పెసా గ్రామసభలను బలోపేతం చేయాలని అన్నారు. గిరిజన రైతులు గిరివికాసం పథకం వినియోగించుకొని ఆర్థిక పరిపుష్టి సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో పెసా మండల అధ్యక్షుడు వజ్జ రాజు, దబ్బకట్ల రాజు, ముత్తరావు, రవి, శ్రీదర్, రమేశ్, వెంకట్, లక్ష్మయ్య, నారాయణ, లక్ష్మి, యాకమ్మ, వినిత్, భాస్కర్, దాసు తదితరులు పాల్గొన్నారు.

### ప్రాజెక్ట్ మేనేజర్‌కు వినతి

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీ–2 ప్రాజెక్ట్ సమీపంలోని గ్రామాలకు ఆర్ అండ్‌ఆర్ అమలు చేయాలని గ్రామాల వాసులు మంగళవారం ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరామిరెడ్డికి వినతిపత్రాలన్ని అందజేశారు. ఫక్కీర్‌గడ్డ, ఆకుదారివాడలకు నష్టపరిహారం చెల్లించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకెజ్ వర్తింపజేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు బుర్ర మనోజ్, రమేష్, బుర్ర తిరుపతి, రవి, సాయి, మహేందర్ పాల్గొన్నారు.

## ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ భవ్యశ్రీ

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో పలువురికి మంగళవారం వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా 95మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. 28 మంది రక్త నమూనాలను సేకరించి, ములుగు ఏరియా ఆస్పత్రికి పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మానవత్వం చాటుకున్న పస్రా ఎస్సై



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: మండల పరిధిలోని మచ్చాపూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు కుమ్మరికుంట్ల నర్సమ్మ పోస్ట్ కార్డు ద్వారా తన సమస్యను పస్రా ఎస్సై కమలాకర్‌కు తెలియజేసింది. సమస్యను తెలుసుకున్న ఎస్సై వెంటనే స్పందించి పరిష్కారం చూపి మానవత్వం చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. మచ్చాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరికుంట్ల నర్సమ్మ 92 సంవత్సరాల వృద్ధురాలుకు నలుగురు కుమారులు. వారు తనని సరిగా చూసుకోవడం లేదని తన సమస్యను ఒక ఉత్తరం ద్వారా పస్రా ఎస్సైకి తెలియజేయడంతో విషయం తెలుసుకున్న ఎస్సై స్వయంగా వృద్ధురాలి ఇంటికి వెళ్లాడు. నర్సమ్మ కుమారులను పిలిపించి కౌన్సెలింగ్ చేసి ఆమె సమస్యను తీర్చారు. సమస్యను క్షేత్ర స్థాయిలో పరిష్కరించిన ఎస్సై కమలాకర్‌ను గ్రామస్తులు అభినందించారు.

# గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండాలి



వెంకటాపురం(కె) : గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్



ఏటూరునాగారం: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై కృష్ణప్రసాద్

వెంకటాపురం(కె) : గోదావరి వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం ఎస్సై అశోక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోదావరి వరద ముంపు ప్రాంతాలైన టేకుల బోరు, వెంగళరావుపేట, తుర్సవానిగూడెం గ్రామాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి గతంలో గోదావరి వరదల సమయంలో గ్రామస్తులకు ఏర్పడిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభమై గోదావరి వరదలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వరదల సమయంలో ముంపు ప్రాంతాల ప్రజలు వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ముంపు గ్రామాలకు చెందిన యువత యూనిఫామ్ లేని పోలీసుల వలె గోదావరి వరదల సమయంలో ప్రజలను కాపాడేందుకు సహకరించాలని కోరారు. అనంతరం ముంపు ప్రాంతాలకు గురయ్యే గ్రామాలకు సంబంధించి వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. వరదల సమయంలో ఎలాంటి సమస్య ఏర్పడినా గ్రూప్‌లో పోస్ట్ చేయాలని సూచించారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలకు పోలీసులు అండగా ఉంటారని తెలిపారు.

ఏటూరునాగారం: వర్షాకాలంలో ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని ఎలిశెట్టిపల్లి, కొత్తూరు, గొత్తికోయగూడేల్లో పర్యటించి గ్రామస్తులకు వర్షాకాలంలో తీసుకోవాలిస్సిన జాగ్రత్తలను వివరించారు. రాబోయే వర్షాకాలంలో ఎవరూ వాగులు దాటే ప్రయత్నం చేయొద్దని కోరారు. గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు ఎవరైనా ఉంటే ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. ఇబ్బందులు పడుతూ గ్రామాల్లో ఉండొద్దని తెలిపారు. వర్షాకాలంలో జంపన్నవాగు ఉప్పొంగి గ్రామంలోకి వరద వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. ఏదైనా అవసరం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## అర్హులకు తునికాకు బోనస్ ఇవ్వాలి



పస్రా ఫారెస్ట్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న కూలీలు

గోవిందరావుపేట: తునికాకు బోనస్ ఇవ్వాలని మంగళవారం పస్రా ఫారెస్ట్ ఆఫీస్ ఎదుట కూలీలు ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి సీపీఎం, గిరిజన సంఘం నాయకులు మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నారు. ములుగు జిల్లాలో తునికాకు సేకరణ చేసిన కూలీలకు 2016 నుంచి 2023 వరకు బోనస్ రాలేదని రూ.600కోట్లు బ్యాంక్‌లలో ఉన్నాయని, అధికారుల నిర్లక్ష్యంతో పంపిణీ జరగటం లేదని తెలిపారు. వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. డబ్బుల పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని, ఆకు సేకరణ చేయని వారికి కూడా బోనస్ డబ్బులు వస్తున్నాయని సంబంధిత ఫారెస్ట్ అధికారులు, కల్లేదారులు కలిసి మోసానికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అర్హులైన తునికాకు కార్మికులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

### మహిళ అదృశ్యం



స్వాతి

గోవిందరావుపేట: రాంనగర్ గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైంది. పస్రా ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంనగర్ గ్రామానికి చెందిన అజ్మీరా వినోద్‌కు 11 సంవత్సరాల క్రితం కమలాపురం గ్రామానికి చెందిన స్వాతి(28)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. వీరి వైవాహిక జీవితంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీ ఆదివారం సాయంత్రం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈనేపథ్యంలో కోపంతో వినోద్ గోవిందరావుపేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేలోగా స్వాతి ఇంటివద్ద కనిపించలేదు. చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా లేకపోవడంతో వినోద్ పస్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఆచూకీ తెలిస్తే 87126 70086 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఇదిలా ఉండగా.. మండల పరిధిలో నాలుగు రోజుల వ్యవధిలోనే ఇద్దరు మహిళలు అదృశ్యమవడం చర్చనీయాంశంగా మారింది.

## ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రవీందర్

టేకుమట్ల: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు ఓనపాకల రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని రామకిష్టాపూర్(టి) ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ పాఠశాల విద్యపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ టీవీతో విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత స్కూల్ యూనిఫాం, మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. విద్యతో పాటు, ప్రతిభాపాటవ పోటీలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రావీణ్యం పొందేలా విద్యాబోధన చేస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ మోజులో డబ్బులు వృథా చేసుకోవద్దని, ప్రభుత్వ విద్యను వినియోగించుకోవాలని సూచించారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయలతో పూర్వ విద్యార్థులు

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్ విద్యార్థులు మంగళవారం కలుసుకున్నారు. సుమారు ముప్పై ఏళ్ల తర్వాత వారు చదువుకున్న పరిషత్ పాఠశాలలోనే ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరడంతో సందడి నెలకొంది.

### దరఖాస్తుల స్వీకరణ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్ ద్వారా అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ 20, సివిల్ 24, ఫిట్టర్ 20, వెల్డర్ 40, మెకానిక్ డీజిల్ 24 సీట్లకు ఆసక్తిగల విద్యార్థులు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 14 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అర్హులు, ఆసక్తి ఉన్న వారు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

### కరాటేతో ఆత్మస్థైర్యం



బ్రౌన్ బెల్ట్ సాధించిన విష్ణుశ్రీ

ఏటూరునాగారం : కరాటేతో ఆడపిల్లలకు ఆత్మస్థైర్యం కలుగుతుందని పునకోషి షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమి అబ్బు మాస్టర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కరాటేలో అకాడమిలో బ్లాక్ బెల్ట్ టెస్ట్ పరీక్షలను నిర్వహించారు. బ్లాక్ బెల్ట్ సాధించిన శ్రీహరిణి, శ్రీహర్షలకు సర్టిఫికెట్లు, బ్లాక్ బెల్ట్‌ను అందజేశారు. పలువురు విద్యార్థులకు రెడ్, బ్రౌన్, వైట్, ఎల్లో బెల్ట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లలకు కరాటే తప్పనిసరిగా నేర్పించాలన్నారు. తద్వారా ఆరోగ్యంతోపాటు మనోధైర్యం పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో హుస్సేన్, ఖాజాపాషా పాల్గొన్నారు.

### పూరి గుడిసె దగ్ధం

రేగొండ: ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధమైన ఘటన రేగొండ మండలం రామన్నగూడెం తండాలో మంగళవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నగూడెం తండాకు చెందిన బానోతు వీరు నాయక్ కుటుంబం వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం ఇంట్లో దేవునికి దీపం వెలిగించి పనులకు వెళ్లారు. ప్రమాదవశాత్తు దీపం కిందపడి ఒక్కసారిగా మంటలు చెలరేగి పూరి గుడిసెకు అంటుకున్నాయి. తండా వాసులు గమనించి మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో రూ.20 వేల నగదు తోపాటు దుస్తులు, బియ్యం పూర్తిగా కాలిపోయాయని బాధితులు వాపోయారు.

## మండలంలో మొదలైన మిషన్ భగీరథ సర్వే



సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి రమాదేవి

ఏటూరునాగారం: మండలంలో మిషన్ భగీరథ సర్వేను మంగళవారం ప్రారంభించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్, వీఏఓలు సర్వే మొదలు పెట్టారు. మిషన్ భగీరథ మొబైల్ యాప్‌లో ప్రతి ఇంటికి వెళ్లి నల్లా ఉందా..? పనిచేస్తుందా.. అని వివరాలను యాప్‌లో పొందుపర్చుతున్నారు. కుటుంబంలో ఉన్న ఒక వ్యక్తికి రోజుకు వంద లీటర్ల నీటిని అందించాల్సి ఉంది. ఆ నీరు అందుతుందా లేదా అని వివరాలను సేకరిస్తున్నారు. ఇంటి యజమాని ఫొటో, సెల్ నంబర్, ఆధార్ నంబర్‌ను తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. అలాగే నల్లా ఫొటోను కూడా తీసుకుంటున్నారు. మిషన్ భగీరథ నల్లాతోపాటు ప్రజా నల్లాల వివరాలను కూడా సేకరిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి వసంతరావు తెలిపారు.

## చదువుల తల్లికి ఆర్థికసాయం



పల్లవికి సాయం అందజేస్తున్న నాయకులు



సాయం అందజేస్తున్న సాంబయ్య

సాక్షి స్పందన

ఏటూరునాగారం/ఎస్ఎస్ తాడ్వాయి: తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన సంకె పల్లవి బాంబే ఐఐటీలో ప్రవేశం పొందిన నేపథ్యంలో సాంబన్న సేన ఆధ్వర్యంలో మంగళవారం సాయం అందించారు. పల్లవికి ఐఐటీలో సీటు వచ్చినా.. ఆర్థికంగా ఇబ్బందిగా ఉందని సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సాంబన్న సేన బాధ్యులు స్పందించారు. తాడ్వాయిలో మాజీ జెడ్పీటీసీ, మాజీ కార్పొరేటర్ కొరబోయిన సాంబయ్య ఆయన మిత్రులు కలిసి రూ. 50వేలు పల్లవికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఆయన వెంట మాదాటి రవీందర్, తోట శశి కుమార్, డాక్టర్ గిరిప్రసాద్, మెట్టు నర్సింగరావు, మెట్టు శ్రీనివాస్, అనుమాల సేన సాగర్, అన్నారపు రవీందర్ రెడ్డి, బక్కి రాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పిలుపు మేరకు ఏటూరునాగారం గ్రామస్తుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎర్రబెల్లి మనోజ్ పల్లవికి రూ.50వేల అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లవిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బాదం ప్రవీణ్, తాడ్వాయి మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ముదిరాజ్, మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ లచ్చుపటేల్, జిల్లా నాయకులు శోభన్, గంపల శివ, గాంధీ ఉన్నారు.

## విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపు సులభం

భూపాలపల్లి రూరల్: విద్యుత్ వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా బిల్లులు చెల్లింపులు చేయడం సులభమని, ఆన్ లైన్ ద్వారా బిల్లుల చెల్లింపు రోజురోజుకూ గణనీయంగా పెరుగుతుందని జయశంకర్ భూపాలపల్లి సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) మల్చూర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సాంకేతికతంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా వివిధ మాధ్యమాల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు సులభతరం అయిందని, అందులో భాగంగా మే నెలలో 16,366మంది గృహ వినియోగదారులు ఆన్ లైన్ ద్వారా రూ.177.33లక్షలు మొత్తాన్ని చెల్లించారని తెలిపారు.

### కాడెద్దులకు శిక్షణ



కాడెద్దులకు శిక్షణ ఇస్తున్న రైతు

మహాముత్తారం: వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరగడంతో.. ఎద్దులు, పాత కాలంనాటి వ్యవసాయం పనిముట్లు చూద్దామంటేనే కనబడకుండా పోయాయి. అలాంటి తరుణంలో మండలంలోని సింగంపల్లి అటవీ ప్రాంతంలో ఓ రైతు కాడెద్దులకు శిక్షణ ఇస్తున్నాడు. బరువులు లాగడం, పొలాలు, చేన్లు దున్నే సమయంతోపాటు బండి కట్టినప్పుడు చెప్పినట్లుగా మలుచుకునే విధంగా వీటికి పలు ప్రాంతాల్లో కొన్ని రోజులు గిర్ర శిక్షణ ఇస్తామని సదరు రైతులు సాక్షితో చెప్పాడు.